# నా తలరాత రాసిందెవరు

రచన

**పి.ఆర్. సుబాష్ చంద్రన్**

తెలుగుసేత

**డా॥ ఎ.బి.కె.ప్రసాద్**

(కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి శ్రీ సుశీల్ కుమార్ షిండే
అంగీకారంతో రచించిన సాధికార జీవిత చరిత్ర)

**ఎమెస్కో**

**నా తలరాత రాసిందెవరు**

రచన : **పి.ఆర్. సుబాష్ చంద్రన్**
e-mail : prschandran@gmail.com

తెలుగుసేత : **డా॥ ఎ.బి.కె.ప్రసాద్**

సంపాదకులు: **డా॥ డి.చంద్రశేఖరరెడ్డి**

ముద్రణ
**జనవరి, 2009**

మూల్యం :**150/-**

© **పి.ఆర్. సుబాష్ చంద్రన్**

ముద్రణ
**సాయిలిఖిత ప్రింటర్స్**
హైదరాబాద్

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
29-13-53, సూర్యారావు పేట,
విజయవాడ - 520 002
ఫోన్స్ : 0866-2436643.

దోమలగూడ, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-23264092, ఫ్యాక్స్ : 040-23264028
www.emescobooks.com
e-mail : emescobooks@yahoo.com

## మీలో తపనే ఉంటే....

*ఈ పుస్తకం ఏ ఒక్కరి కోసమోకాదు, అందరికోసం ఉద్దేశించింది. అనాథలు, పేదలు, పేదరికంలో చిన్నచిన్న దొంగతనాలకు అలవాటుపడినవారు, మధ్యలో చదువులు చాలించుకున్న పిల్లలు, విద్యారంగంలో వెనుకబడి పోయిన పేదలు, అణగారిపోయిన వారు, భగ్నప్రేమికులు, జీవితంలో వైఫల్యాల పరంపర చూసినవారు - ఒకరేమిటి, అలాంటి వారందరికీ ఈ పుస్తకం అంకితం....*

*జీవితంలో సమున్నత స్థానాన్ని అందుకోవాలన్న తపనాగ్ని మీలో రగుల్కొనకపోతే, దయచేసి ఈ పుస్తకాన్ని తెరవొద్దు, తెరవొద్దు, చదవొద్దు, చదవొద్దు.!*

# విజయం నీ జన్మహక్కు

లేడి ఉప్పెనలా దూసుకుపోతోంది
కాళ్లు భూమిపై ఆన్చకుండా చెంగుచెంగున గెంతుతోంది,
అడ్డంకుల్ని లెక్కచేయకుండా పరుగెడుతోంది–
దానికి తెలుసు,
కాలు జారితే కాటికేనని!

ప్రయాణంలో దారి తప్పిందా,
దానికి తెలుసు
పులి కోరల్లో చిక్కిపోతానని–
స్థలకాలాలతో నిమిత్తంలేకుండా, పరుగెడుతున్నాననీ
జయించడానికే పరుగెడుతున్నాననీ!

పులిదీ అదే చూపు–
అదీ పరుగెడుతోంది భయంకరంగా
కడుపుచిచ్చు చల్లార్చుకోడానికి ఏకైక లక్ష్యంతో
దానికీ తెలుసు–
కొంచెం కన్ను మరల్చితే ఆకలిమంటకు ఆహుతౌతానని
అందుకే ఆకలి చావును తప్పించుకోడానికి
అది పిచ్చెత్తినట్టు పరుగెడుతోంది,
జయించడానికే పరుగుపెడుతోంది!

నీవు లేడివైనా, పులివైనా
పరుగుపందెంనుంచి పారిపోకు
నిన్ను వెన్నాడుతున్నదెవరు?
ఎవరైనా సరే పట్టించుకోకు!
లక్ష్యానికి గురిపెట్టు
ఉప్పెనలా దూసుకుపో!

తెల్లవారే వరకూ పరుగెత్తు, పరుగెత్తు
చీకటిపడేదాకా పరుగెత్తు, పరుగెత్తు
గెలుపే లక్ష్యంగా పరుగెత్తు, పరుగెత్తు!

*(ఒక అజ్ఞాతకవి తమిళకవిత ఆధారంగా)*

"త్యాగం" అనే ఒకే ఒక్క పదంతో నన్ను
కదిలించిన త్యాగశీలి శ్రీమతి సోనియాగాంధీకి
ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

# కృతజ్ఞతలు

షిండేకు సంబంధించిన ఈ జీవిత చరిత్రను ఈ రూపంలో పొందుపరచడానికి నాకు ఉత్సాహప్రోత్సాహాలు అందించి, నన్ను ప్రేరేపించిన ఈ క్రింది వ్యక్తులకు కృతజ్ఞతలు, అభినందనలు మాత్రమే ఈ రచయితకు అందుబాటులో ఉన్న మాటలు. అంతకన్నా మించిన పదం నాకు లభించినప్పుడు వారందరికీ నేను వినమ్రతాపూర్వకమైన, మనఃపూర్వకమైన నమోవాకాలు తెల్పుకుంటాను.

నాలో ప్రేరణ కల్పించిన వ్యక్తులు : ఈ గ్రంథ రచనకు నన్ను పురిగొల్పిన సమకాలీన సజీవశక్తీ, ప్రసిద్ధ మూర్తీ శ్రీ సుశీల్‌కుమార్ షిండే, సుప్రసిద్ధ కవి (తమిళ) సుబ్రహ్మణ్యభారతిగారు సుందరమైన తెలుగుగా అభివర్ణించిన మన భాష (తెలుగు)లోకి ఇంగ్లీషు పదాలకు సరిపడా తెలుగు నుడికారాలతో మధురమైన భావనను చేర్చి ఇంగ్లీషులో ఉన్న ఈ పుస్తకాన్ని తెలుగులో చెప్పేందుకు రాత్రింబవళ్ళు శ్రమించి పాఠకదేవుళ్ళు నన్ను అభిమానించేలా చేసిన తెలుగు భాషాసంఘ అధ్యక్షులు డాక్టర్ శ్రీ ఎ.బి.కె.ప్రసాద్ (డి.లిట్) గార్కి నేను ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోగలను?!

ఈ బయోగ్రాఫీ మొదలుపెట్టినప్పుడు సుశీల్‌కుమార్ షిండే ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఓ సందర్భంలో ఎమెస్కో అధినేత దూపాటి విజయకుమార్‌గారు గవర్నర్‌గారిని కలవడానికి వచ్చినప్పుడు నేను ఆయనను కలవడం జరిగింది. ఆ సమయంలో నేను షిండే బయోగ్రఫీ ఇంగ్లీషులో రాస్తున్నానని చెప్పిన వెంటనే మేము దానిని తెలుగులోనికి అనువదించి ముద్రిస్తామని చెప్పి, రెండు సంవత్సరాల తరువాత విజయకుమార్‌గారిని నేను కలిసినపుడు మరిచిపోకుండా, ఈ సందర్భం కోసమే ఎదురుచూస్తూన్నానంటూ ప్రోత్సహించి అన్ని విధాల సహకరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు పాఠకుల ముందుకు తీసుకువచ్చిన ఎమెస్కో విజయకుమార్‌గారికి నేను మనఃస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

నాకు అవిశ్రాంతంగా సహకరించిన నా భార్య శ్రీమతి ఎస్.చారుమతి, శ్రీ షిండేకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా (ఢిల్లీ) పనిచేసిన స్క్వాడ్రన్ లీడర్

అమిత్ కుమార్ కౌశిక్, హైదరాబాద్ రాజభవన్ సిబ్బంది, కేంద్ర విద్యుత్‌శాఖ (న్యూఢిల్లీ) సిబ్బంది, డా॥బి.ఎల్.ముంగేకర్ ప్రణాళికా సంఘం (న్యూఢిల్లీ) సభ్యుడు, ఎ.ఐ.సి.సి. కార్యదర్శి డాక్టర్ కె.జయకుమార్, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి (హైదరాబాద్) శ్రీ కె.మాధవరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాద్) ప్రొఫెసర్ శ్రీ జి.తిరుపతి కుమార్, అన్వర్ ఉలుమ్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీ సత్యనారాయణ, విజయనగర్ కామర్స్ కాలేజి (హైదరాబాద్) అసోసియేట్ ప్రొఫెసర్ బి.బ్రహ్మానంద చారి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ కె.ఎస్.చలం (న్యూఢిల్లీ), యు.జి.సి. చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేవ్ థొరాట్ (న్యూఢిల్లీ), షోలాపూర్ అడ్వొకేట్ శ్రీ కల్యాణరావ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ న్యూస్ పేపర్స్ (ముంబై), హైదరాబాద్ శాఖ జనరల్ మేనేజర్ శ్రీ బిజూమాథ్యూ, ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ సి.ఎం.డి. శ్రీ ఓమ్ నారాయణ్ (న్యూఢిల్లీ), స్టెనోగ్రాఫర్ శ్రీ మధు ఆర్.నాయర్ (న్యూఢిల్లీ), ఐ.ఆర్.ఎస్ అధికారి శ్రీ ఆర్.ఎస్.అరవిందాక్షణ్ (నాగపూర్), శ్రీ ఎం. శ్రీనివాసరావు (గోవలంక), శ్రీ ఆర్.ఎస్. రాజా (హైదరాబాద్), శ్రీమతి కొమిరిపాలెపు పద్మావతి, అన్నామలై విశ్వవిద్యాలయం, చిదంబరం (తమిళనాడు), మనస్తత్త్వశాస్త్ర శాఖ రీడర్ ప్రొఫెసర్ కదిరివన్, డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం (ఐ.ఎ.ఎస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యదర్శి, శ్రీ ఉదయకుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరు (ముఖ్యమంత్రి కార్యాలయం), ఇంకా ఇంకా ఎందరెందరో, మానవ, మానవేతర శక్తులన్నింటికీ నా వందన చందనాలు!

***– పి.ఆర్.సుబాష్ చంద్రన్***

**డా॥ వై.యస్.రాజశేఖర రెడ్డి**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

# తొలిపలుకు

ఇది కేవలం 'హస్త' భూషణం లాంటి పుస్తకం కాదు. ఒక వజ్రాల పేటిక. సానపట్టని వజ్రం తన సహజ విలువను ప్రపంచానికి చాటిచెప్పలేదు. అలాగే ప్రతివ్యక్తి తనలోని ఆశల, ఆశయాల సాధన కోసం కృషి, పట్టుదల, కఠోరశ్రమ చేయకపోతే రాణించలేడు.

ఈ పుస్తకాన్ని కేవలం పఠించడంతోనే ఆపేస్తే సరిపోదు. దీనిలోని విషయాన్ని గ్రహించాలి. పిండితార్థాన్ని పట్టుదలగా ఆచరించినప్పుడే దీని ప్రయోజనం పరివ్యాప్తం అవుతుంది.

నా మిత్రుడు, ప్రముఖ జర్నలిస్టు సుభాష్ చంద్రన్ నా దగ్గరకు వచ్చి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ సుశీల్ కుమార్ షిండే (గతంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా పనిచేశారు) జీవిత చరిత్ర చదివి 'తొలిపలుకు' రాయమని నన్ను కోరారు. రెండువందల యాభై పేజీలున్న ఈ పుస్తకం చదివేందుకు సమయం చిక్కుతుందా? అన్న అనుమానం నాకు కలిగింది.

అయితే, నా ప్రియమిత్రుడు సుశీల్ కుమార్ షిండే జీవిత చరిత్ర చదివిన తరువాత నా హృదయంలో ఎంతో మార్పు వచ్చింది. దీన్ని చదివి ఉండకపోతే ఒక ఉన్నతమైన వ్యక్తి జీవిత నేపథ్యం గురించి తెలుసుకొనే అదృష్టాన్ని కోల్పోయేవాడినేమోనన్న భావం నాలో కలిగింది.

ఇది ఒక నవలా అంటే.... నవలే అని చెప్పొచ్చు. ఓ డిటెక్టివ్ స్టోరీనా? అంటే అవుననే సమాధానం ఇవ్వవచ్చు. చేయి పట్టి నడకలు నేర్పవలసిన కన్నతండ్రిని కోల్పోయిన ఒక బుడతడు స్వయంగా రాసుకున్న జీవితకథా అంటే... కాక మరేమిటన్న జవాబు కూడా దొరుకుతుంది. ఒక సామాన్యుడు అసామాన్యుడిగా మారేందుకు మార్గదర్శిగా ఈ పుస్తకం ఉద్భవించిందా అంటే దానికీ అవుననే ఠక్కున చెప్పుకోవచ్చు.

జీవిత గమనంలో దారీ తెన్నూ కానరాక చెడు వ్యసనాలకు బానిసలైన కొందరు పిల్లల్ని ఇటీవల కలిశాను. ఆ సందర్భంగా వారు 'మేము ఇలా దారి తప్పడానికి మాకు అమ్మనాన్నలు లేకపోవడమే' అని చెప్పిన సమాధానం నన్ను తీవ్రమైన ఆలోచనలో పడేసింది. అయితే, ఈ పుస్తకం చదువుతున్నంతసేపూ అలా చిన్ననాటనే తండ్రిని కోల్పోయిన షిండే అతి సామాన్య బీదస్థితి నుంచి కృషి, పట్టుదల, కార్యదీక్షతో అసామాన్యుడిగా ఎదిగిన పద్ధతి నన్ను కట్టిపడేసింది. పుస్తకం చదవడం పూర్తయ్యే వరకూ నన్ను నేను మైమరిచానంటే నమ్మండి.

'దగడు' అనబడే బుల్లి సుశీల్ కుమార్ షిండే తండ్రి మరణానంతరం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. కుటుంబపోషణ కోసం కూరగాయలు అమ్మాడు. పెళ్ళిళ్ళలో లాంతరులు మోశాడు. ఫ్యాక్టరీలో బాలకార్మికుడయ్యాడు. తరువాత ఓ సంపన్న కుటుంబంలో పనికుర్రాడిగా చేరాడు. అష్టకష్టాలతో ఓ రెండున్నర సంవత్సరాలు గడిచిన అనంతరం 'మంచి మార్గంలోకి వెళ్ళాలన్నా, సమాజంలో చక్కని స్థానం పొందాలన్నా చదువే ప్రధానం' అన్న పెద్దల మాటను ఆకళింపు చేసుకున్న షిండే రాత్రిబడిలో చేరాడు. దానితో ఆనాడే ఆయన ఆశయాల సాధనకు చక్కని రాచబాట పడినట్లైంది. జీవితంలో కొత్త మజిలీకి మార్గం ఏర్పడింది.

పదిసంవత్సరాల చిరుప్రాయంలో షిండే ఇంటిపని కుర్రాడిగా చేరి ఇల్లుతుడవడం, అంట్లుతోమడం, చెట్లకు నీళ్లు పోయటం ఇలా ఎన్నో పనులు చేసేవాడు. పగలు పనిచేస్తూ అర్ధరాత్రి వరకు కిరోసిన్ దీపం కాంతిలో చదివిన ఆయనకు దేవుని రూపంలో ఓ ఉద్యోగం లభించింది. నెలకు 10 రూపాయిలకే పనివాడుగా మొదలై 70 రూపాయలు లభించే బాయ్‌ప్యూన్ ఉద్యోగం దొరికింది. అంటే కష్టపడిన వారికి తప్పక ఫలితం అందుతుందనేది సత్యం. అందుకు ఇది మంచి ఉదాహరణ. అలా మరో ఎనిమిదేళ్లు కష్టపడిన షిండే బాలకార్మికుడి దశనుంచి పదోన్నతి పొందారు. అయితే, ఈ ఎనిమిదేళ్ళలో షిండే ఏ విధంగా వ్యక్తిత్వ వికాసం పొందారన్న విషయం వివరించిన తీరు నన్ను అమితంగా ఆకర్షించింది. ఆంగ్లంలో మూడు సార్లు తప్పి పట్టుదలతో ఏమైనా సరే పాసై తీరాలన్న దీక్షతో షిండే చేసిన పరిశ్రమ నన్ను మరింతగా ఆకట్టుకున్నది.

దళితవర్గంలో జన్మించి 'ఇదీ ఒక బతుకేనా?' అనేలా ఎన్నో కష్టాలు పడిన షిండే ఏనాడూ తన పట్ల తనకు అసహ్యం కలగకుండా జాగ్రత్తపడ్డాడు. 'ఆహా! ఎంత మంచి జీవితం. నా ఈ 16 సం..ల వయస్సులో 70 రూపాయల జీతం తీసుకుంటున్నానంటే నాదేశంలోని ఎంతోమంది నిరుద్యోగులకన్నా

నేనెంతోమేలుకదా,' అనే ఆలోచనతో జీవితాన్నే తనవైపుకు మలచుకున్న ఆయన విశ్వాసాన్ని చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఆదర్శ పురుషుడు ఎక్కడయ్యా, ఎవరయ్యా అనేవారికి 'ఇదిగో ఇక్కడే! నేనే' అనే రీతిలో ధైర్యంగా ముందువరుసలో నిలిచే "లివింగ్ లెజెండ్" అయ్యారు. తనకంటూ ఒక గుర్తింపు సంపాదించాలన్న క్రమంలో షిండే ఒక రంగస్థల నటుడేగాక, సంగీత విద్వాంసుడిగా కూడా మారారు.

ఓటమి ఓ గొప్ప విజయానికి తొలిమెట్టు అని, అదే జీవితమార్గదర్శిగా ఎలా ఉపయోగపడుతుందో షిండే జీవిత చరిత్రలో పలు ఉదాహరణల ద్వారా మనకు తేటతెల్లం అవుతుంది. జీవితం మీద విరక్తి చెందినవారు సైతం షిండే జీవితచరిత్ర ఓసారి చదివితే 'నేను బతికే తీరుతాను' అనే గొప్ప నిర్ణయం తీసుకునేందుకు ఆధారమవుతుందని నేను ఘంటాపథంగా చెప్పగలను.

**అక్షరసత్యం:**

జీవితంలో ఓటమిని కూడా షిండే విజయానికి మార్గదర్శకంగా ఎలా తీసుకున్నారో ఈ ఉదాహరణ చూస్తే మీకే తెలుస్తుంది.

షిండే పోలీస్ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్నప్పుడు శరద్‌పవార్‌ను కలవాల్సి వచ్చింది. ఆ సందర్భంగా శరద్‌పవార్ ఇచ్చిన సలహామేరకు చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి మహారాష్ట్రలో ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఎంతో ఆశతో ఎదురు చూసిన ఆయనకు నిరాశే మిగిలింది. మొక్కవోని ధైర్యంతో ఎదురుదెబ్బలు తగిలినప్పుడే విజయం వైపు మరింత దూసుకుపోగలిగిన షిండే వైనాన్ని వివరించిన అధ్యాయం మనలోని ప్రతి ఒక్కరికీ ఒక పాఠం అవుతుందనడంలో సందేహం లేదు.

సవాళ్ళను ఎదుర్కోవడం అంటే షిండేకు ఓ క్రీడ, ఉద్యోగం పోయి, ఎమ్మెల్యే పదవి రాక, అయ్యో మోసపోయానే, నా ఉద్యోగం పోయిందని బాధపడకుండా ఈ ఉద్యోగం పోవడం ఇంకో కొత్తదారిని చూపించిన దిశామార్గం అనుకొని లాయర్ వృత్తి ప్రారంభించి ఓటమి అనేది ఒక సందేశం (మెసేజ్) మాత్రమే కాని, జీవితాన్ని కోల్పోవటం కాదనీ " ఈ బస్సు మిస్సయితేనేం, విమానంలో వచ్చేశాను" (*I miss the bus to catch the flight*) అనే తెగువ కూడా షిండే జీవితచరిత్ర ద్వారా గమనించవచ్చు.

**'ఓటమి లేని వ్యక్తిని చూపిస్తే**
**చావే లేని జీవిని చూపిస్తా' నన్నాడో జ్ఞాని.**

షిండే జీవితచరిత్ర అంతా కష్టాలు, నష్టాలు, బాధలు, అవమానాలు, నిరాశ, నిస్పృహలే. అయినా సరే 'ఐ కెన్' – (నేను చేసే తీర్తాను) అనే ధోరణిలోనే ముందుకు సాగిన వైనం మనల్ని ఆశ్చర్యానందాల్లో ముంచెత్తుతుందనడంలో సందేహం లేదు. ప్రతి విషయంలోనూ ఓ పూర్తి నమ్మకంతో, దృఢ దీక్ష, పట్టుదలతో సాగిన జీవన యానం షిండేది.

ఈ రోజు మనందరం ఎంతో గౌరవంతో అంగీకరించిన వ్యక్తి, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీకి అత్యంత విశ్వాసపాత్రుడైన పార్టీ కార్యకర్త, ఓటమి చెందిన వారు మళ్ళీ గెలుపు గుర్రాలుగా మారేందుకు మార్గదర్శి షిండే జీవితచరిత్రలో ఎన్నో ఉదాహరణలను గమనించవచ్చు. ఈ సందర్భంగా నాకు ప్రసిద్ధ కవి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన 'అపజయాల నుంచి – విజయ తీరాలకు' అనే కవిత గుర్తు చేయాలనిపిస్తోంది:

"ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి
ఎన్నడూ వదులుకోవద్దురా ఓరిమి
విశ్రమించవద్దు ఏ క్షణం
విస్మరించవద్దు నిర్ణయం
అప్పుడే నీ జీవితం నిశ్చయం.
నింగి ఎంత పెద్దదైనా రివ్వుమన్న గువ్వపిల్ల రెక్క ముందు తక్కువేరా
సంద్రమెంత గొప్పదైనా ఈదుతున్న చేపపిల్ల మొప్పముందు చిన్నదేరా
నిషా విలాసమెంత సేపురా ఉషోదయాన్ని ఎవ్వరాపురా
రగులుతున్న గుండె కూడ సూర్యగోళం వంటిదేనురా

నొప్పి లేని నిమిషమేది
జననమైన మరణమైన జీవితాన
అడుగడుగున నీరసించి నిలిచిపోతే
నిమిషమైన నీది కాదు
బ్రతుకు అంటే నిత్య ఘర్షణ.
దేహముంది ధైర్యముంది,
నెత్తురుంది సత్తువుంది
ఇంతకంతకూ సైన్యమందున
ఆశనీకు అస్త్రమౌను

శ్వాస నీకు శస్త్రమౌను
ఆశయమ్ము సారథౌనురా
నిరంతరం ప్రయత్నమున్నదా నిరాశకే నిరాశ పుట్టురా
ఆయువంటూ ఉన్న వరకూ
చావు కూడా నెగ్గలేక
శవముపైనే గెలుపు చాటురా!

చివరగా, షిండే జీవిత చరిత్ర పుస్తకానికి తొలి పలుకులు రాసేందుకు అవకాశం ఇచ్చిన నా మిత్రుడు, జర్నలిస్టు సుబాష్ చంద్రన్ దీనితోనే ఆగిపోకుండా 'ఇది సాధ్యం, ఇదే కాదు ఏదైనా సాధ్యం' అనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రగిలించేలా మరిన్ని పుస్తకాలు రాసి, నవతరాలకు అందించాలని నా ఆకాంక్ష.

ముందు మాటను ముగించే ముందు తెలుగు తల్లికి గౌరవం అందించి, క్షణక్షణం 'తెలుగుభాష' అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నా మిత్రులు, పెద్దలు, ప్రముఖ పాత్రికేయులు, సాహితీవేత్త అయిన శ్రీ ఎ.బి.కె. ప్రసాద్ ఈ పుస్తకాన్ని ఇంగ్లీష్‌నుండి తెలుగులోకి అనువదించిన తీరు ప్రశంసనీయం.

హైదరాబాద్
డిసెంబరు, 2008

# ఎందుకీ పుస్తకం...

**మ**నిషి స్వభావం వేరు, సలక్షణంగా దాన్ని సాకుకుంటూ పోవడం వేరు. వంశ పారంపర్య లక్షణాలు పొదిగిఉండే జన్యువులు వేరు, పరిసరాలు వేరు. ఈ వైరుధ్యం గురించిన చర్చోపచర్చలు విజ్ఞాన శాస్త్రాల, తత్త్వశాస్త్రాల సహాయంతో, ఊహాపోహాలపై ఆధారపడిన వాదప్రతివాదాలు, సాక్ష్యాధారాలు, సిద్ధాంతాలు, ఊహాజనిత ప్రతిపాదనలు, నిత్యనిరూపణల సాయంతో నాటినుంచి నేటిదాకా శతాబ్దాలుగా సాగుతున్నవే. అయినప్పటికీ, ప్రశ్న ప్రశ్నలాగానే ఉండిపోయింది, ప్రశ్నకు 'ఇదీ తుది పరిష్కారం' అని ఎవరూ చెప్పగల స్థితిలో లేరు.

నేను ఒక కనస్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తూ నా జీవితాన్ని ఆరంభించాను. కొన్ని సంవత్సరాల తరువాత ట్రేడ్ యూనియన్ లీడర్‌గా పనిచేసాను. తదుపరి అది వదలి పాలరాతి వ్యాపారం చేసాను. కాని నా మనసులో చిన్నతనంనుంచి జర్నలిజంపై అభిరుచి పెరగడంతో పాల వ్యాపారం చేస్తూ భారతీయ విద్యాభవన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజమ్‌లో సాయంత్రం జర్నలిజం కోర్సులో చేరాను. అక్కడ పి.జి. డిప్లమాలో గోల్డ్‌మెడల్ సాధించాను. కొన్ని కారణాల వలన వివిధ రకాల పనులు, వ్యాపారం చేసిన నా మనసుకు సంతోషాన్ని ఇవ్వలేదు, ఏదో తెలియని లోటు. నా చిన్ననాటి కల, అభిరుచి మేరకు నా దృష్టి జర్నలిజంపై కేంద్రీకరించిఉంది. ఈ విషయాన్ని నా స్నేహితులతో చెప్పగా వాళ్ళు హేళన చేసి వ్యతిరేక అభిప్రాయాన్ని తెలియజేశారు. అయినా జర్నలిజంలోనే నా మనసుకు సంపూర్ణ ఆనందం కులుగుతుందని, తద్వారా నాకు లభించే అధికారంతో ఇతరులకు నా సహాయ మార్గాన్ని సూచించగలగనే ఉద్దేశంతో జర్నలిజంలో చేరాను. ఇది కేవలం నా మనస్సులో ఉన్న పట్టుదల, సాధించాలనే తపన నా గమ్యాన్ని సూచించడంతో ఇది సాధ్యమైంది. ఇది ఎలా సాధించగలిగానంటే నా మనస్సులో ఉన్న చిన్ననాటి కోరిక నానాటికి బలపడుతూండటం వలన, నా చుట్టూఉన్న జర్నలిస్టుల (స్నేహితులు) ద్వారా ప్రేరేపితుడనవుతూండడం వలన ఇది సాధ్యమైంది.

వైద్యుడూ, జ్యోతిష్కుడైన నా మిత్రుడొకడు సంభాషణ మధ్యలో ఓ ఆసక్తికరమైన కథ వినిపించాడు. మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో పరిసరాలు కీలకమైన పాత్ర వహిస్తాయన్న విషయాన్ని వివరించడానికి మిత్రుడు ఈ కథనం వినిపించాడు. ఓ ప్రసూతి కేంద్రంలో ఒకేరోజున, ఒకే ఘడియలో పుట్టిన నలుగురు పిల్లల చుట్టూ ఈ

కథనం తిరుగుతుంది. ఎదిగిన తర్వాత ఈ పిల్లల్లో ఒకడు డాక్టరు అయ్యాడు, మరొకడు మందుల ఉత్పత్తి దారయ్యాడు, మూడోవాడు వాచ్‌మన్ అయ్యాడు, నాల్గోవాడు నేరస్థుడయ్యాడు. ఈ కథంతా వినిపించిన తర్వాత ఆ మిత్రుడు ఓ ప్రశ్న వేశాడు– ఈ నలుగురూ వాళ్లు చేపట్టిన వ్యాపకాలకూ, వాళ్ల విద్యాస్థాయికి, వాళ్లు పుట్టిపెరిగిన పరిసరాలకు దోహదం చేసిన అంశాలకూ వాళ్ల జీవితాలే కారణమై ఉండకపోతే, అందుకు మరెవరిది బాధ్యతని చెబుదాం? ఈ ప్రశ్నవిన్న తర్వాత నాకు అనిపించింది– సుశీల్‌కుమార్ షిండే ప్రత్యేక లక్షణాలు మూర్తీభవించిన వ్యక్తి అనీ, విభిన్న పరిస్థితులనూ, సంఘటనలనూ, రకరకాల సన్నివేశాలనూ, సందర్భాలనూ కాచివడపోసిన సంకీర్ణ వ్యక్తిత్వం గల వ్యక్తి అనీ. శూద్రుడుగా ఆయన చర్మకారుల కుటుంబంలో పుట్టాడు. తర్వాత పోలీసు ఆఫీసరు అవడంతో క్షత్రియుడి పాత్ర వహించాడు, ఆ తర్వాత వైశ్యుడి పాత్ర ధరించాడు, న్యాయవాది అయ్యాడు! అంటే, చాతుర్వర్ణ వ్యవస్థలోని నాలుగు వర్ణాలకూ షిండే ప్రాతినిథ్యం వహించాడని అర్థం! విద్వత్ సంపన్నతలో ఆయన ప్రతిభ, ఆయనలోని జ్ఞానార్జనా తపనా సంప్రదాయంగా వస్తున్న బ్రాహ్మణీయ సంస్కృతితో ముడిపడి ఉన్నాయి! అయితే ఇందుకు ఉదాహరణ షిండే ఒక్కడే గాదు, బడుగు స్థితిగతులనుంచి ఎదిగివచ్చి బహుముఖ ప్రజ్ఞావంతులయిన వారెందరో ఉన్నారు. మహారాష్ట్రనుంచి ప్రభవిల్లిన అలాంటి ఉద్దండులలో వెంటనే మన మనస్సుకు తట్టే పేరు భీమారావ్ రామ్‌జీ అంబేద్కర్. అంబేద్కర్, షిండేలు ఇద్దరూ మహారాష్ట్రకు చెందిన దళితులే. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ వారు నడిపిన చారిత్రక పోరాటాలే వారి విజయానికి ఏకైక కారణం. అయితే అంబేద్కర్ జీవితం అనుపమానమైన చరిత్ర కాగా, దృఢ దీక్షలోనూ, వెసులుబాటులోనూ అంబేద్కర్‌తో సామ్యమున్న వ్యక్తి సుశీల్‌కుమార్ షిండే అని చెబితే అతిశయోక్తి కాదు.

సుశీల్‌కుమార్ షిండే ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు నేను మొదటిసారిగా "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" న్యూస్ పేపరు (ముంబై) కోసం ఇంటర్వ్యూ అడిగాను. అప్పుడు షిండే అలవోకగా సరాసరి నన్నో ప్రశ్న అడిగాడు: "బడుగు బలహీన స్థితిలో ఉన్న వాడికి ఈ ఇంటర్వ్యూ ఏదైనా ఉత్తేజకరమైన సందేశం అందించగలదా?" అని! బీదస్థితిలో ఉన్నవాడికి అలాంటి ఇంటర్వ్యూలో ప్రయోజనకరమైన సందేశం ఏదీ లేకుండా, కేవలం నా వ్యక్తిగత అభిమానాలు, అభిరుచులూ ఇష్టా నిష్టాలు, నా ఆహార అలవాట్లు వగైరా ఉబుసుపోని విషయాలు పనికి మాలిన సోదిగానే మిగిలిపోతాయని షిండే అన్నాడు; అతి దీనమైన పరిస్థితుల నుంచి వచ్చిన వ్యక్తి దారిద్ర్యాన్నీ, సామాజిక వివక్షనూ, నిరక్షరాస్యతనూ అనుక్షణం ఎదుర్కొంటూనే జీవితంలో ఎంతోకొంత అర్థవంతమైన విజయాన్ని ఎలా సాధించవచ్చునో చెప్పగలిగిన సందేశంగా ఆ ఇంటర్వ్యూ ఉండాలన్నాడు. శాసనసభ్యునిగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా,

కేంద్రమంత్రిగా షిండే తాను ఏ ప్రజలమధ్య నుంచి వచ్చాడో, ఆ ప్రజలకు సేవ చేశానని చెప్పాడు. ఈనాటి యువతకు కార్యసాధనలో ఆదర్శం నెలకొల్పగల వ్యక్తి అవసరం ఎంతో ఉందని, అలాంటి ఆదర్శమూర్తి మీరే కాగలరని నేనన్నాను. ఈ నా సంభాషణే షిండేతో ఇంటర్వ్యూకి పునాది అయి, అదికాస్తా ఇలా జీవితచరిత్ర రూపంలో వెలువడుతోంది. ఆయనతో నేను సంభాషించిన ప్రతిరోజూ ఒక ప్రత్యేకతగానే ఉండేది. ఎందుకంటే ఏరోజుకారోజు షిండేలో ఒక నూతనమూర్తిని నేను చూడగలిగాను; ఏరోజుకారోజు ఆయనలోని బహుముఖీన వ్యక్తిత్వంలోని ఒక్కొక్క విశేషమూ బయట పడుతూండేది. ఆయన చెప్పే ప్రతి ఒక్క గాథ ఆయన జీవితానుభవంతో ముడిపడి ఉండేది. అది ఆయన గుండె అంతరాంతరాల్లోంచి వచ్చేది. ఆయన చెప్పుకొచ్చే గాథలు నన్ను మంత్రముగ్ధుణ్ణి చేశాయి. ఎందుకంటే, షోలాపూర్‌లోని దళిత పరిసరాలలోని ఆ మురికి వాడలనుంచి వచ్చి తన మనోబలం కొద్దీ, ఆత్మస్థైర్యంకొద్దీ దృఢదీక్షతో అంతటి ఉన్నతికి ఒక వ్యక్తి రాగలిగాడంటే నాకు ఆశ్చర్యం కల్గింది!

షిండేలో నేను కనిపెట్టిన లక్షణాలలో అత్యంత విశేషమైనది – ఆయన తన జేబులో ఒక్క పైసా లేనప్పుడు, ఆత్మస్థైర్యం తప్ప మరో ఆధారం తనకు లేనప్పటికీ 'నిండుకుండ'లా ప్రతికూల పరిస్థితుల్ని సహితం తట్టుకొని నిలబడగల్గడం! ఇంతకూ షిండే బహుముఖ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది ఆయన చుట్టూరా ఉన్న పరిసరాలా లేక వంశపారంపర్య లక్షణాలా అని వేధిస్తున్న ప్రశ్నకు సమాధానం రాబట్టడం అంత తేలికేం కాదు. ఉదాహరణకు షిండే తాతగారైన శివరాం షిండే చాల ధైర్యసాహసాలున్న వ్యక్తి. కష్టమో, నష్టమో చొరవతో పరిస్థితులకు ఎదురొడ్డి నిలవగల శక్తియుక్తులు ఆయన నుంచే సుశీల్‌కుమార్ షిండేకి పారంపర్యంగా వచ్చి ఉండొచ్చు. సాహసంతో కష్టనష్టాల్ని ఎదుర్కోవడం ఆయనకి ఇష్టం. అదే ఆయన జీవితాన్ని మలుస్తూ వచ్చింది. అలా ఇబ్బందుల్ని జంకూ కొంకూ లేకుండా ఎదుర్కోవడం ఆయన సహజగుణంగా కన్పిస్తుంది, ఆయన జీవాణువుల్లోనే (జీన్స్) బహుశా ఆ లక్షణాలున్నాయనిపిస్తుంది నాకు. అంతేకాదు, ఆయన జీవితంలో అనేక గడ్డు పరిస్థితుల్ని తరచుగా ఎదుర్కొనడమూ జరిగింది. అయినా వెన్ను చూపిందిలేదు. షిండేలో ఉన్న ఈ స్థిరచిత్తమే, ఈ స్థితప్రజ్ఞే ఆయన విజయ రహస్యం. ఈ గంభీరతే ఆయనను కదిలించి ముందుకు నడిపించింది.

పట్టుదల, వెసులుబాటుతనం, సలక్షణమైన ఆలోచన, ఓర్పు, విధేయత – ఈ లక్షణాలన్నీ షిండేకు 'బంగారానికి తావి' అబ్బినట్టు అదనపు ఆభరణాలుగా అమరాయి; ఆయన విజయ పరంపర వెనక రహస్యం ఇదే. షిండే తన సుదీర్ఘమైన, విశిష్టమైన జీవనయానంలో కనబరిచిన నిబ్బరానికి ప్రత్యేకతవుందని నా ఉద్దేశం. విద్యాభ్యాసానికి తగిన వాతావరణం తనకు లేని పరిస్థితులలో విద్యార్జన కోసం షిండే కనబరిచిన

జిజ్ఞాస, పడిన తపన ఆయన పట్టుదలకు నిదర్శనం. తాను బడిలో చేరితీరాలి, మధ్యలో చదువు చాలించినవాడిగా ఉండదలచుకోలేదు; తాను మరింత ఉన్నతాదర్శం వైపే మొగ్గ చూపాలి. ఏమైనా సరే అనుకున్నట్లుగా విద్యను పూర్తి చేయడమే తన ప్రాథమిక లక్ష్యం – ఇదీ ఆయన తపనంతా. ముళ్లకంచెల్లాంటి ఇన్ని ఆటంకాలు, అవాంతరాల మధ్యనుంచి సమున్నత స్థాయికీ, ప్రసిద్ధికీ ఎదిగి రావడానికి షిండే సుదీర్ఘమైన కష్టసాధ్యమైన ప్రయాణమే సాగించాల్సివచ్చింది. ఆయనలోని ఈ గుణమే నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఒక కల నిజం కావడమంటే అదేమరి; కల కనగల ధైర్యంతోపాటు ఆయన ఆ కలను ఆచరణలో వాస్తవం చేసుకోగల శక్తిమంతుడు కూడా. ఇదేదో తేలికైన విషయంగా మనకనిపించవచ్చు. కాని వాస్తవంలో కార్యసాధకుడికి ఈ పని ఎంత కష్టమో ఈ పుస్తకం పూసగుచ్చినట్లు మీకు వివరిస్తుంది. సుశీల్‌కుమార్ తను సాధించిన విజయాలగురించి స్వోత్కర్షగా చెప్పుకొనే వ్యక్తికాదు. అతను వినమ్రుడు. జీవిత చరిత్ర రాయించుకోగలంత వ్యక్తిని కాదనుకుంటాడాయన. సమాజంలోని బడుగు బలహీన వర్గాలు, అట్టడుగువర్గాలు మాత్రమే మన దృష్టికీ, మన శ్రద్ధకూ కేంద్రబిందువు కావాలంటాడాయన. షిండే జీవితం, ప్రతికూల పరిస్థితులకు వ్యతిరేకంగా ఎదురొడ్డి ఆయన సాగించిన పోరాటం, ఆయన కార్యదీక్ష – ఆయన ఎదుర్కొన్నలాంటి పరిస్థితులలోనే పడి కొట్టుమిట్టాడుతున్న బడుగు బలహీన వర్గాలకు మరవలేని, మరపురాని సందేశం కావాలి. అప్పుడు మాత్రమే, ఒక దళిత బాలుడిగా కష్టాలకారడవి నుంచి ప్రయాణంచేసి నేడు జాతీయ రాజకీయాల్లో ఇంతటి ప్రముఖ స్థానంలో నిలబడ్డ వ్యక్తిగా ఆయన అనుభవాలను అక్షరబద్ధం చేయడానికి ఒక విలువా సలువా ఉంటుంది. షిండే కోరుకునేది కూడా అదే. ఈ జీవితచరిత్ర గ్రంథంపైన తుది తీర్పును పాఠకుడికి, చరిత్రకూ విడిచిపెడదాం.

నాకు తెలిసిన విషయాలతో చుట్టూ ఉన్న వనరులమీద ఆధారపడి షిండేగారి అంగీకారంతో రాయబడిన ఈ జీవితచరిత్ర ఒక వ్యక్తి ఏవిధంగా వైఫల్యాలు, దారిద్ర్యం నుండి ఎలా వ్యక్తిత్వ వికాసం పొందాడో, తమకు లభించిన వైఫల్యాలనే విజయాలుగా వ్యక్తులు ఎలా మలచుకోవచ్చో చెప్పే ప్రయత్నమే ఈ ప్రయాణం. తప్పుఒప్పులు సరిదిద్దే ప్రయత్నంలో ఎక్కడో ఒకచోట విషయాలు చెప్పడంలో నేను జారిపడి ఉండవచ్చు. చెప్పండి ఎక్కడ పడ్డానో? దానినుండి ఏదో ఒకటి నేర్చుకుంటాను, రాబోయే ఎడిషన్లలో ఆ పొరపాట్లు దొర్లకుండా!

హైదరాబాద్ **– పి.ఆర్. సుభాష్‌చంద్రన్**

డిసెంబర్ 2008

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అసాధ్యం సుసాధ్యమైన వేళ... | 19 |
| 2. | బాధాలేదు- ఫలితమూ లేదు | 25 |
| 3. | జీవితమే ఓ బడి! | 39 |
| 4. | నాలుగు 'రాళ్లు' సంపాదిస్తూనే నాలుగు ముక్కలు నేర్వడం! | 49 |
| 5. | ఓ మైలురాయి దాటి... | 59 |
| 6. | ఇదో తొలిమెట్టు | 71 |
| 7. | మాటతప్పకుండా, మడం తిప్పకుండా.... | 85 |
| 8. | రేపటి విజయానికి సోపానం నేటి వైఫల్యం | 101 |
| 9. | బస్సు 'మిస్స'యినా విమానం దొరికింది! | 107 |
| 10. | ఎదుగుదలకు మంత్రం! | 121 |
| 11. | రేపటి విజయానికి మారుపేరే నేటి అపజయం! | 135 |
| 12. | గెలిచినవాడు 'బరి'నుంచి తప్పుకోడు ఓడినవాడు 'బరి'లోకి దిగడు! | 145 |
| 13. | మార్పు ప్రకృతి తీర్పు! | 155 |
| 14. | వైఫల్యమే ఒక సందేశం! | 165 |
| 15. | పోతేపోనీ, వస్తేరానీ.... | 177 |
| 16. | మార్పు, మేలైన సమాజంకోసం.... | 191 |
| 17. | విజయం చిరునామా విధేయత! | 201 |
| 18. | విజయానికి 'దొడ్డిదారు'ల్లేవు! | 207 |
| 19. | కల్లోల సంద్రాన నావ నిలుచున్నాది చుక్కాని పట్టరా చేవగల నావికా..!! | 233 |
| 20. | మజిలీలు ఎరుగని విజయపరంపర! | 249 |
| 21. | నా గురువులు వీరే.... | 261 |
| 22. | తలపోతలు | 279 |
| | కొసమెరుపు! | 299 |
| | అనుబంధం - 1 | 305 |
| | అనుబంధం - 2 | 309 |
| | అనుబంధం - 3 | 311 |
| | అనుబంధం - 4 | 312 |

“**జీ**వితం’ నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు – పేదరికం, కులమత భేదాలు. ఒకటి (పేదరికం) నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందేగాని వాటికి బానిసగా నన్ను ఏమాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చివేసి మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు, దాని విధానంపైనే నా ద్వేషం”

**–మహాకవి గుర్రం జాషువ**

## ఒకటవ అధ్యాయం

# అసాధ్యం సుసాధ్యమైన వేళ...

**అ**ది 1956 వ సంవత్సరం.

స్థలం విద్యామందిర్ స్కూల్, షోలాపూర్

సమయం, సాయంత్రం 8 గంటలు.

అక్కడ వాతావరణమంతా విద్యుదావేశంతో నిండిఉంది. ఆర్భాటంలేని సెట్టింగ్, సాదా సీదాగా ఉన్న తెర, ప్రచార ఆర్భాటం లేకుండానే ఏర్పాటయిన నాటక ప్రదర్శన చూడ్డానికి వచ్చిన కొద్దిపాటి జనం. అయినా క్షణం గడుస్తున్నకొద్దీ ప్రేక్షకుల్లో ఏదో ఉత్కంఠ. ఒకవైపు ఓర్పులేని ప్రేక్షకుల ఈలలూ, ఇంకోవైపునుంచి స్త్రీలను ఉద్రేకపరిచే కేకలూ చెవులు బద్దలుకొడు తున్నాయి. ఆలస్యమవుతున్నకొద్దీ ప్రేక్షకుల ఓర్పు నశిస్తోందని గమనించిన నాటక ప్రదర్శన నిర్వాహకులు సుప్రసిద్ధ మరాఠీ నాటకకర్త బాల్ కొల్హాట్కర్ రాసిన **"ముంబైచీ మానసే"** అనే ప్రసిద్ధ నాటకం కొద్దిసేపట్లో ప్రదర్శించనున్నామని ప్రకటించారు. ఈ నాటకంలో "శాంత" అనే నటిని ప్రేక్షకులు చూడబోతున్నారని చెప్పారు. ఆడబోయే నాటకం ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠలో నాటక నిర్వాహకులున్నారు.

రెండుగంటలసేపు సాగిన నాటకం, ఒక గ్రామ అందాలరాణి అయిన "శాంత" ఎదిగివచ్చిన తీరుపైన కేంద్రీకరించిన నాటకం. ఆమె నటనా చాతుర్యం రంగస్థలంపై ఉన్నత శిఖరాలు అందుకోవడంతో అది ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. దాంతో నాటక ప్రదర్శన నిర్వాహకుల భయం కాస్తా తొలగిపోయింది. శాంత నటన, ఆమె నేత్రాంచలాలు ఓ చిన్న పట్టణపు ప్రేక్షకుల్ని ఎంతగా చూరగొని వశీకరించుకున్నాయంటే – ఆ తరువాత ప్రదర్శించబోయే **"కార్యాలా గేలోయేక్"** అన్న నాటకంలో "గులాబ్" అనే పేరుతో వచ్చే స్త్రీ పాత్ర కూడా "శాంత" తోనే వేయించాలని స్కూలు అధికారులు భావించారు. అలాగే "గులాబ్" నాటకం కూడా ప్రదర్శించడమూ జరిగింది, ప్రేక్షకుల మనస్సులను అది కొల్ల గొట్టడమూ జరిగింది. ఇంతకూ "శాంత", "గులాబ్" పాత్రలు ధరించిన ఆ 'నటి' ఎవరనుకున్నారు? ఈ రెండు స్త్రీ పాత్రలు

ధరించిన వ్యక్తి మరెవరో కాదు, మన కథానాయకుడు సుశీల్‌కుమార్ షిండే! ఆయన ఎంతో భావగర్భితంగా, అర్థవంతంగా సజీవమైన ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల్ని తాదాత్మ్యం చెందేలా చేశారు. నేత్రపర్వంగా ఉంటూ ఆకట్టుకునే అతనిలోని నటనా చాతుర్యానికి తోడు 'పూవుకు తావి' అబ్బినట్టుగా ఆయన స్ఫురద్రూపం కూడా తోడయింది. చూపులకేకాదు, అసలు రంగస్థలంపై నటించడానికి కొందరు ఫికరు పడతారు. కాని సుశీల్‌కు అలాంటి ఫికరు పిసరంత కూడా లేదు. ఆయన చాల సాదాసీదాగా ఉండే మనిషని అందరూ చెబుతారు. అలా అలవోకగా నటించగల శక్తి ఈయనకు ఎక్కడినుంచి అబ్బిందో ఎవరికీ తెలీదు. అటు ఆయన తాతగారు శివరామ్ షిండేకుగాని, తండ్రి శంభాజీరావుకి గానీ ఏనాడూ రంగస్థలంతో పరిచయమేలేదు. మహా అయితే తాత, తండ్రులిద్దరూ ప్రేక్షకుల్లో కూర్చునేవారేమో! వాళ్లూ తమ తాత, తండ్రులమాదిరే చాల నిరాడంబరంగా జీవించిన వ్యక్తులు. దినవారీ ఉపయోగించుకునే తోలు వస్తువుల్ని తయారుచేసేవారు. ఆడంబరాలకు దూరంగా గడిపారు, కాని ప్రయోజనకరమూ అర్థవంతమూ అయిన జీవితాలు గడిపారు; గొప్ప వ్యక్తులు ఎన్నడూ వ్యర్థజీవితాలు గడపరు గదా.

చిన్న చిన్న ఘటనలే మనిషి జీవన మార్గాన్ని ఎలా మార్చేస్తాయో ఊహించలేం. చెప్పుకోడానికి స్వల్ప విషయాలుగా కనిపించవచ్చుగాని చిన్నతనంలోనే సుశీల్‌కు రంగస్థల నటనతో వచ్చిన అనుభవం ఆయన వ్యక్తిత్వంపైన శాశ్వత ముద్రవేసింది. ఆ ఆశాభావం ఆయన్ని స్వశక్తిపై నమ్మకం పెంచుకునేలా చేసింది; ఆత్మవిశ్వాసం కల్పించింది. దాంతో సుశీల్‌కుమార్ షిండే జీవితం అనుకోని మలుపులు తిరిగింది, ఆ క్రమంలో నూతన అనుభవాలు చవిచూడ గలిగారు. అప్పటి దాకా ఆయనకు తనమీద తనకే నమ్మకంలేని పరిస్థితి; ముఖ్యంగా జనంముందుకు వెళ్లాలన్నా, పెద్దవాళ్లముందరగానీ, పెద్ద సభలలో గాని బెరుకు బెరుకుగా ఉండేవారు. కాని, రంగస్థలంపై ఏకపాత్రాభినయం ఆయనలోని బెరుకును ఊడగొట్టేసింది! తెలియని వాళ్లను చూస్తే భయపడే మనస్తత్వం కాస్తా ఉడాయించేసింది. ఆత్మశక్తీ, ఆత్మవిశ్వాసం లేనప్పుడు ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న పిరికితనం ముమ్మరిస్తుంది. అది కాస్తా ఆయనలోపోయింది. ఇక రంగస్థలంపై ఎవ్వరి తోడూ లేకుండానే స్వయంగా ప్రదర్శన ఇవ్వగలనని, ప్రశాంతంగానే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలనన్న ధీమా ఆయనకు వచ్చేసింది. ఈ రంగస్థల పోటీల్లో ఆయన చురుగ్గా పాల్గొంటూ రావడంవల్ల ఆయనలోని బిడియం, దిగులూ మటుమాయమైపోయి, 'శాంత', 'గులాబ్' నాటకాలలో రాణించడానికి మార్గం ఏర్పడింది. ఇలా తనను నాటకాలలో ప్రవేశించడానికి ప్రోత్సహించి తన రంగస్థల ప్రవేశానికి దోహదం చేసిన ఉపాధ్యాయులకు ఆయన ఎంతో కృతజ్ఞుడు; గురువులందించిన ఈ ఉత్సాహ ప్రోత్సాహాలకు ఎంత ప్రాధాన్యముందో సుశీల్‌కుమార్ షిండే తన అనంతర జీవితంలో మరింతగా గుర్తించగలిగాడు.

సుశీల్‌కుమార్ బిడియంవల్ల సాధారణంగా క్లాసులో వెనక బెంచీలోనే కూర్చునేవాడు. కాని అంతకుముందొకసారి ఆయన గురువు వక్తృత్వపోటీలో పాల్గొనేవారిలో సుశీల్ పేరును ప్రతిపాదించడం జరిగింది. దొరికిన అవకాశాన్ని అందిపుచ్చుకొని వెలుగులోకి రావడానికి బలవంతంగానైనా సుశీల్ ఆ పోటీలో పాల్గొనక తప్పలేదు. తన ఉపాధ్యాయులంతా ఎదురుచూస్తూండగా, సుశీల్ పోటీలోకిదిగాడు, ఉపన్యసిస్తున్నాడు, అలా అతను చెబుతున్న ప్రతిమాటనూ ఆదుర్దాగా క్లాసంతా వినడం చూశాడు. తాను ఏం చెబుతున్నానన్నది ఇక్కడ ముఖ్యంకాదు, తాను శ్రోతల్ని మెప్పించడం ప్రధానం అనుకున్నాడు. శ్రోతల దృష్టిని ఆకర్షించాలంటే ఆత్మవిశ్వాసం అవసరం, సూటిగా మాట్లాడాలంటే ఆత్మవిశ్వాసం తప్పనిసరి అనుకున్నాడు. తన ప్రతిభను చాటుకోడానికి రెండు నిమిషాలు చాలనుకున్నాడు; శ్రోతల్ని మెప్పించాలని నిర్ణయించుకుని, పిరికితనాన్ని నెట్టేసి ఆత్మవిశ్వాసం తెచ్చుకున్నాడు; అంతకుముందు పోటీల్లో మాదిరిగానే ఈసారికూడా సవాలు అందిపుచ్చుకోవడంలో ప్రతిభా శక్తియుక్తుల గురించి ఈషణ్మాత్రం సంశయం కూడా ఎవరికీ రాకుండా చూసుకున్నాడు. ఇలా సభలో మాట్లాడాలన్న ఆసక్తి బాల్యదశలోనే తనకుండేదని ఆయనకు తెలుసు. ఈ ఆసక్తి వెనుక ఓ ముఖ్యమైన పాఠం ఉంది – తాను అనుకున్నవిధంగా ఈ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ముందుగా ఆత్మాభిమానం అవసరం, అనివార్యం. అలా 'ఆత్మాభిమాన'మనే అవతారంలో సుశీల్‌కుమార్ షిండే తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నూతనకాంతిలో దర్శించడం ప్రారంభించాడు.

ఇలా సుశీల్‌కుమార్ షిండే జీవనయాత్ర అనామక స్థితినుంచి అత్యంత కీర్తి, ప్రఖ్యాతుల దిశగా ప్రారంభమయింది. రానున్న సంవత్సరాలలో ఆయనను వెతుక్కుంటూ అనేక పరిణామాలు, అనుభవాలూ ఎదురుకానున్నాయి. అవి – కల్పనా జగత్తును తలదన్నే అద్భుతమైన, అనూహ్యమైన వాస్తవ జీవితాన్ని ఆవిష్కరిస్తాయి!

సుశీల్ స్కూలు చదువును మధ్యలోనే చాలించుకోవలసివచ్చిన కుర్రాడు (డ్రాపవుట్); చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన బిడ్డ, శ్రద్ధతో తనను సాకే తండ్రి నీడను కోల్పోయిన బిడ్డ, ఆరాధనామూర్తిగా ఉండవలసిన నాన్నను కోల్పోయిన బిడ్డ. ఒక రంగస్థల నటుడిగా మెట్టుమెట్టుగా ఎదిగివచ్చి, క్రమంగా రాజకీయ విజయాలకు కల్పతరువుగా మారిన వ్యక్తి సుశీల్. ఈ విషయం విన్న వాళ్లెవరైనా, అయిదవతరగతి 'డ్రాపవుట్'గా ఉన్న వ్యక్తి ఇలా ఎదిగిరావడం అసాధ్యమంటారు. ఈ ఎదుగుదల ఆయనకి ఎలా సాధ్యమయిందన్న ప్రశ్న నేటి యువకులకు ఒక పట్టాన అంతుపట్టని సమస్య. ఎందుకంటే, ఇవాళ్టి యువతరం స్వశక్తిపై గాకుండా మరొకరి మీద ఆధారపడడానికో లేదా ఒక పోషకుడిమీదనో, ఒక జ్ఞానపిత మీదనో లేదా ఒక సహాయకుడి మీదనో ఆధారపడజూస్తారు. కానీ ఆర్థిక సహాయంకోసం, సామాజిక సహకారంకోసం, మానసికమైన ఆత్మీయతానుబంధం కోసం ఇతరులపైన ఆధారపడడమన్నది చాలా 'ఖరీదైన' ప్రయోగం. కాబట్టి ఈ పూర్వరంగం నుండి పరిశీలించినప్పుడు, బిడియంగానూ, సంప్రదాయవాదిగానూ మితభాషిగానూ ఉండే సుశీల్‌కుమార్‌కు అంత తొందరగా అందరితో కలిసిపోయే కలివిడితనం

ఎలా అబ్బిందబ్బా అనిపిస్తుంది. చిన్నతనంనుంచి అష్టకష్టాలమధ్య పెరుగుతూ మృదువుగా, సాధువులా కనిపించే ఈ కుర్రాడు ఇతరులకు ఆదర్శప్రాయుడుకాగల వ్యక్తిగా, విజయుడిగా ఎలా తనకు తానై రూపొందగలిగాడు? ఇలా షిండే సాధించిన లాంటి విజయాన్ని పొందడం మధ్యలో స్కూలు చదువుమాని వేసే ప్రతీవాడికీ సాధ్యమవుతుందా? కేవలం 'అదృష్టం' (లక్కు) వల్లనే సుశీల్‌కుమార్ అలా పైకొచ్చాడా? షిండే నైపుణ్యాన్నీ, కుశాగ్రబుద్ధినీ అనుసరించిన మరెవరైనా సరే, షిండే అనుసరించిన మెళకువలను అనుసరించగలరా? షిండే నేడొక అంతర్జాతీయ ప్రసిద్ధి గడించిన వ్యక్తి, అణగారిన, దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్న బడుగు బలహీనవర్గాల ఆదర్శమూర్తి, నిబ్బరంగల వ్యక్తి, గుణశీలత, సునిశితమైన ప్రగతిశీల ఆలోచనలు మూర్తీభవించిన వ్యక్తి. షిండే జీవితచరిత్ర చదివేవారి మనస్సుకు వెంటనే తట్టే ప్రశ్నల్లో ఇవికొన్ని మాత్రమే. అలాంటి ప్రశ్నలు వేయనివారికోసం ఉద్దేశించిన పుస్తకం కాదిది. మానవుల మనస్సును తరచి తరచిచూస్తే ప్రతి ఒక్క ప్రశ్నకూ స్పందించే వ్యథార్థ జీవిత యథార్థ దృశ్యం ఈ గ్రంథం. ప్రశ్నలకు ఎదురయ్యే ఇందులోని సమాధానాలు మీకు ఆశ్చర్యం గొల్పుతాయి. సకల సౌకర్యాలతో కూడిన కుటుంబం, సమాదరించగల సామాజిక పూర్వరంగం, తనకు దన్నుగా నిలబడే వ్యవస్థ అండదండలు పుష్కలంగా ఉన్న కులీన వర్గాలకు చెందిన వ్యక్తులు సాధించలేని విజయాలను– సమాజంలో తరతరాల అనాదరణకు గురైన అట్టడుగు వర్గంనుంచి ఎదిగివచ్చిన ఒక అనాథ సాధించగలిగాడు. సంస్కారవంతులయిన కుటుంబంలో ఒక పనివాడు (సర్వెంటు)గా రెండున్నర సంవత్సరాలు గడిపిన షిండేలో "నేను మాత్రం ఆ కుటుంబ సభ్యుల మాదిరి ఎందుకు ఎదగలేన"న్న ప్రశ్న ఉదయించింది. ఈ ప్రశ్న అతణ్ణి బడిలో చేరేలా ప్రోత్సహించింది. 5వ తరగతిలో తాను చదువుచాలించిన కుర్రాడు. కాని వివిధ చోట్ల మూడేళ్లు పనిచేసిన తరువాత దగడు (షిండే) ఎనిమిదవ తరగతిలో చేరడమే ఓ ఆశ్చర్యకర సన్నివేశం.

ఎవరైనా, "ఈ ప్రపంచంలో అత్యంత భయంకరమైన జబ్బు ఏ"దని ప్రశ్నిస్తే దానికి మనం ఏ సమాధానం చెబుతాం?

ఆ 'జబ్బు'ను కొందరు 'ఎయిడ్స్' వ్యాధి అని చెబుతారు, ఇంకొందరు 'క్యాన్సర్' అంటారు– అలా తలొకమాటా చెబుతారు. కాని ఆ ప్రశ్నకు జవాబు మాత్రం అది కాదంటే మీరు నమ్మరు.

ప్రశ్నలో పేర్కొన్న 'జబ్బు' కనపడని ఓ 'అదృశ్యరోగం'. కాని పైకి కనిపించని ఈ రోగం వ్యక్తుల వ్యక్తిత్వాన్ని ఘోరంగా దెబ్బతీస్తోంది. అది ప్రపంచ జనాభాలో నూటికి 90 మందిని పీడిస్తున్న 'రోగం'. దాని పేరే సభా పిరికితనం – స్టేజిఫియరు!

ఇలాంటి రోగం ఒకటి ప్రపంచంలో ప్రచలితమవుతోందని తెలియనందుకు ఎవరూ చింతించనక్కర్లేదు సుమా! ఎందుకంటే ఇలాంటి జబ్బు ప్రతీ కుటుంబంలోనూ విస్తరించిఉంది, మన జీవన శైలిలో అదొక భాగమైపోయింది! ఎక్కడైనా ఓ బహిరంగసభలో "వందన సమర్పణ చేయండి" అని మనల్ని కోరినప్పుడు మనలో చాలమందిమి సభాపిరికితనంవల్ల జంకుతూంటాం;

స్టేజి మీదకు వెళ్లం, ఒకవేళ "వందన సమర్పణ" చేయడానికి మనల్ని పిలవబోతున్నారని తెలియగానే సభనుంచి నెమ్మదిగా జారుకుంటాం! చాలాకొద్దిమంది మాత్రమే – మొత్తం జనాభాలో 5–8 శాతం మంది మాత్రమే సభా పిరికితనం లేకుండా స్టేజి ఎక్కడానికి ముందుకొస్తారు.

ఈ బాపతు 'పిరికితనం' చాలామందిని ఎందుకు ఏడిపిస్తోంది?

ఒక అధ్యయనం ప్రకారం, ఈ జబ్బుకి కారణం – మనిషిలో ఆత్మవిశ్వాసం లేకపోవడమే! రాండీలూబో అనే పెద్ద మనిషి ఒకడు "స్టేజి (సభా) పిరికితనం వదిలించుకోండి" ("Over come your Stage Fright") అన్న పేరుతో ఓ పుస్తకం రాశాడు. చాలామందికి రంగస్థలం మీదికొచ్చి నటించాలంటే ముచ్చెమటలు పోస్తాయనీ, ఏదో ఆందోళనకు గురవుతూంటారనీ, ఈ లక్షణం మనిషి వ్యక్తిత్వానికే చెరుపనీ, చొరవను చంపేసి భయభ్రాంతికి లోను చేస్తుందనీ చెప్పాడు. అంతేకాదు, అలాంటి లక్షణం వ్యక్తిని అశక్తుణ్ణి చేసి ఎదగకుండా కుంచింపజేస్తుందనీ, నీరస పరుస్తుందనీ లూబో అంటాడు. ఇలాంటి స్టేజి పిరికితనం వల్ల, ఎంతోమంది ఎదిగి రావలసిన నటులు, శక్తియుక్తులున్నవాళ్లూ రంగంమీదకు రాలేకపోయారు, లేదా వాళ్ల యాక్టివిటీ కుంచించుకుపోవలసివచ్చింది.

అందువల్ల, ఈ భయంకరమైన 'వ్యాధి'ని (స్టేజి భయం), నయం చేసుకోగల వ్యాధిని అధిగమించి పురోగమించడం ఎవరికైనా సాధ్యమా? తప్పకుండా సాధ్యమే, సుసాధ్యమే. ఎందుకంటే సాధ్యమని ఒకాయన అక్షరాల నిరూపించాడు. స్టేజి పిరికితనం ఎలా పోగొట్టుకోవచ్చో చూపించినవాడతడు. అందుకే షిండే అంగీకారంతో వెలువడుతున్న ఆయన ఈ జీవిత చరిత్రను చదవండి. ఆ వ్యక్తి పేదవాడై ఉండి కూడా ప్రశ్నించే ధైర్యం ఎలా పొందాడు; అలా ప్రశ్నించే తత్వంవల్ల వక్తృత్వ పోటీల్లో ప్రవేశించడానికి ఎదురైన అడ్డంకులను, సంకోచాలనూ తానెలా అధిగమించగలిగిందీ, భయాన్ని ఎలా తరిమికొట్టగలిగిందీ, ఆత్మవిశ్వాసంతో అన్నిరకాల అడ్డంకుల్నీ ఎలా వదిలించుకున్నదీ, తనలోని ఈ లక్షణాలే తాను జాతీయ రాజకీయ రంగస్థలంపైన రాణించడానికి తగిన పూర్వ రంగాన్ని ఎలా సిద్ధం చేసిందీ ఈ గ్రంథం తెలుపుతుంది.

ఆ విజయగాథలోని ఆంతర్యాన్ని ఆవిష్కరిస్తోందీ పుస్తకం. అంటే, జీవితంలో ఎదురయ్యే ప్రతీ అననుకూల పరిస్థితినీ ఎవరికివారు తమకు సానుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నించగోరే వారికి, తద్వారా షిండేలా కుశాగ్రబుద్ధితో దొరికిన అవకాశాన్ని అనన్య సామాన్యమైన రీతిలో మలచుకోవడం ద్వారా సానుకూల్యత విలువను పెంచగోరే వారికీ – ఈ పుస్తకమే ఒక సందేశం! ప్రతికూల పరిస్థితులకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచి పోరాడిన షిండే ప్రతిఘటనా శక్తీ, ఆ పోరులో ఆయన సాధించిన అంతిమ విజయాలూ ఈ పుస్తకంలో వివరంగా ఆవిష్కరించు కున్నాయి. కష్టపడే గుణం, దృఢ దీక్ష, పట్టుదల ఈ అనాథను కడు సమున్నత స్థానంలో ఎలా నిలబెట్టాయో ఈ పుస్తకంలోని మిగిలిన అధ్యాయాలు వెల్లడిస్తాయి.

★ ★ ★

*"**భా**రతదేశంలోని చాతుర్వర్ణ్య వ్యవస్థ (నాలుగు రకాల కుల విభజన) అత్యంత విషపూరితమైన వ్యవస్థ... ఈ కులవ్యవస్థ సిద్ధాంతాన్ని భుజాన వేసుకొని తిరిగే ఉన్మాదులెవరు? అగ్రవర్ణం. ఈ కుల వ్యవస్థా చట్రం నుంచి దేశ ప్రజాబాహుళ్యం విముక్తి పొందిననాడు ఈ అగ్రవర్ణం ఒక వర్గం (క్లాస్)గా తన అధికారానికి ఆభిజాత్యానికి, గౌరవానికి ప్రమాదం ముంచు కొచ్చినట్టు భావిస్తుంది. అందుకే కులవ్యవస్థను రక్షించుకోవాలని ఆ వర్గం చూస్తుంది"*

**–డాక్టర్ అంబేద్కర్**